# ఆడపుట్టుక

## కొండముది విజయలక్ష్మీదేవి

"అమ్మాయ్ సరళా! ఇంకా కాలేజీకి టైమ్ కాలా?" దొడ్లో నుంచి అనసూయమ్మ కేకేసింది, బాయిలర్ లోంచి బకెట్లోకి నీళ్ళు తోలుస్తూ. "పొద్దున్నే సుప్రభాతం నేను పాడాలి, కాఫీ కలిపి మంచం దగ్గరకు తెచ్చి 'తాగు తల్లీ!' అంటూ నోటి కందించాలి, వేన్నీళ్ళు పెట్టి నీ స్నానానికి నీళ్ళు నే తోలిపి పెట్టాలి, ఆనక టేబిలు మీద టిఫిన్ పెట్టి, 'రా తల్లీ! వచ్చి తిని వెళ్ళు!' అంటూ ఆహ్వానం చెయ్యాలి, టిఫిన్ అయిం తర్వాత, డ్రెస్సు.... డ్రెస్సు తర్వాత బస్సు... అబ్బబ్బ! ఒక్క పిల్లవన్న మాటే కానీ చచ్చి పోతున్నానే తల్లీ!" అంటూ తల్లి అంటున్న మాటల్ని సరదాగా వింటూ, వంటింటి గుమ్మం దగ్గరకు వచ్చి నిలబడింది నవ్వు మొహంతో సరళ.

ఆ అమ్మాయి చిదిమి దీపం పెట్టుకునేట్టుగా వుంది. ఆడపిల్లల కాలేజీలో బి. ఏ. ఫైనలియర్ చదువుతోంది. సోషియాలజీ మెయిన్‌గా తీసుకుని. తనను గురించి తల్లి పడే కంగారు చూస్తే ఆ అమ్మాయికి తమాషాగా వుంటుంది. తనేమన్నా పాలు తాగే పసిపిల్లా? 'పసిపిల్ల' అనే ఆవిడ అభిప్రాయం. కాదనీ, తన పనులు తాను. చేసుకుంటాననీ అంటే మళ్ళీ అందుకు వొప్పుకోదు. అసలు అందరు తల్లులూ అంతే నేమో!

సరళ యాదాలాపంగా పక్క యింటికేసి చూసింది. అక్కణ్నుంచి చూస్తే డాక్టర్ తిలక్ గారి ఇల్లు మధ్య గది నుంచి దొడ్లో వరకూ స్పష్టంగా కనిపిస్తుంది. ఇప్పుడా ఇల్లు చూస్తుంటే సరళకు విచారం వేస్తుంటుంది. దిగులుగా, బోసిగా, కళాకాంతులూ పోయి, వంటరితనంతో కుమిలిపోతున్నట్టుగా వుంటున్నదా ఇల్లు. ముందు గదిలో ఉంటారు డాక్టరు తిలక్‌గారు. ఆయన సర్జన్ కాదు. కన్సల్టింగ్ ఫిజిషియన్ మాత్రమే. అయితే ఏం, బాపట్ల - చీరాల ప్రాంతంలోనే కాదు, ఇటు నెల్లూరు, అటు ఏలూరు నుంచి కూడా ఆయన దగ్గరకు పేషెంట్స్ వస్తుంటారు, ముఖ్యంగా గుండె జబ్బుల వాళ్ళు, ఎంత మంది వచ్చినా చడీ చప్పుడూ కాకుండా వస్తారు. రెండో కంటి వాడికి తెలియకుండా వైద్యం చేయించుకుని వెళ్ళిపోతారు. తిలక్ గారి ఇంటి ముందు కార్లు ఎన్ని వచ్చి ఆగినా, ఆ కార్లల్లో నుంచి ఎంత మంది దిగినా, అంతా నిశ్శబ్దంగా జరిగిపోతుంటుంది. ఆయన పిల్లలు మధ్య గదిలో చదువుకుంటుంటారు. ఇంక ఆయన భార్య వంట పొయ్యి దగ్గర నిలబడి ఏం వండాలో చెబుతూ, పిల్లలకూ, భర్తకూ ఏ సమయానికి ఏం కావాలో చూసుకుంటూ, ఇల్లు సర్దుకుంటూ, ఎప్పుడూ ఏదో పని చేస్తూ చూడగానే వో ఆదర భావం, గౌరవ భావం కలిగేట్టుగా. ప్రవర్తిస్తూ, డాక్టరు గారికి తగినట్టుగా ఉండేది.

సరళకు ఆవిడంటే చనువు, ప్రేమ, ఆత్మీయత. ఆవిడ ఉన్నంత వరకూ రోజూ సగం సమయం ఆ ఇంట్లోనే గడిపేసేది. డాక్టరు గారి పిల్లలు సరళ చుట్టూ చేరి "అక్కా! అక్కా!" అంటూ కబుర్లు చెప్పేవారు. కబుర్లు చెప్పమని వేధించుకు తినేవారు. సరళ డాక్టరు గారి భార్యను 'పిన్నీ!' అని పిలిచేది. నిజానికి ఆవిడకు "పిన్నీ!" అని పిలిపించుకోవాల్సినంతటి వయసు లేకపోయినా అట్లా సరళ పిలిస్తేనే కాని ఊరుకునేది కాదు. మహా అయితే సరళ కన్నా ఓ పదేళ్ళు పెద్ద ఆవిడ! ఒకసారి ఆ విషయమే ప్రస్తావన చేస్తే, "నా పిల్లలు నిన్ను 'అక్కా' అని పిలుస్తుంటే, నీకు నేనేమవుతాను మరి?" అని నవ్వేసింది.

"అదేవిటే అమ్మాయ్, నువ్వు నా కూతురు లాంటి దానివి, నన్ను 'అక్కా!' అని పిలుస్తావేం?" అని అడిగింది సరళ వాళ్ళ అమ్మ, ఆవిణ్నో సారి.

"మీ కంటికి నేను చిన్నపిల్లలా కనిపిస్తుంటే, నా కంటికి సరళ చిన్నపిల్లలా కనిపిస్తుంటుందండీ! అయినా ఇద్దరు పిల్లల తల్లిని! ఇంకా నేను చిన్న దాన్నేవిటి?" అన్నదావిడ గంభీరంగా.

ఆవిడ పెద్దదిగా కనిపించినా కనిపించకపోయినా, డాక్టర్ తిలక్‌గారు మాత్రం పెద్ద వాడు గానే కన్పిస్తుంటారు. సగం తలంతా బట్ట తల అయిపోయింది. మెదమెదలాడే వొళ్ళు. స్థూల శరీరం. మనిషి అంత పొడుగూ కాదు, పొట్టీ కాదు.

ఓ సాయంకాలం పూట, పూలు కడుతూ, టీ. వీ. చూస్తూ, టీ. వీ. లో ఎడ్వర్టయిజ్‌మెంట్స్ వస్తున్నప్పుడు, యాదాలాపంగా అన్నది సరళ, "పిన్నీ! ఆ ప్రకటనలో ఉన్నాయనకు. ఆవిడ రెండో పెళ్ళాంగా లేదూ, నువ్వు - బాబాయ్ గారూ ఉన్నట్టు?"

"ఈ మాట డాక్టరు గారితో అనేవ్, నీకు ఇహ తలకాయ నొప్పి కూడా ఆయన బిళ్ళలివ్వరు, తనో బాలా కుమారుణ్ణనుకుంటుంటారాయన!"

"ఆయన బాలా కుమారు డెట్లా అవుతాడూ ఇద్దరు పిల్లల తండ్రి అయింతర్వాత?"

"ఏం పిల్లలు పుడితే ముసలితనం వచ్చేసినట్లేనేవిటే, తమాషాగా మాట్లాడుతావూ?"

"ముసలితనం వచ్చినట్టు కాదు పిన్నీ, యౌవనం వెళ్ళిపోయినట్టు!"

ఆ ఇంటి వేపు చూడగానే సరళకు ఇదంతా జ్ఞాపకం వచ్చింది. కళ్ళల్లో నీటి తెర కదిలింది. యౌవనం వెళ్ళిపోయినా, వెళ్ళిపోకపోయినా, డాక్టరు గారి భార్య మాత్రం ఉన్నట్టుండి ఈ లోకం విడిచి వెళ్ళిపోయింది. ఒక రోగం లేదు, రొష్ఠు లేదు, సుష్టుగా భోం చేసింది. హాయిగా పిల్లలతో కాసేపు కబుర్లు చెప్పి, మంచం మీద ప్రశాంతంగా నిద్రపోయింది. మర్నాటి ప్రొద్దున్న చూస్తే అదే శాశ్వత నిద్ర అయింది. ఏదో టెక్నికల్ పేరు చెప్పారు డాక్టరు గారు ఆవిడ అకస్మాత్తు చావుకు. ఏ పేరైతే ఏం సరళ కొక మంచి స్నేహితురాలు కరువైంది. డాక్టరు గారి కొక ఉత్తమ ఇల్లాలు దూరమైంది సరళ వాళ్ళ అమ్మ కొక చెప్పుకో దగిన ఇరుగూ పొరుగూ లేకుండా పోయింది.

భారమైన హృదయంతో, సరళ, ఆ రోజు ఉదయం తన మామూలు పనులన్నీ కొంచెం మంద కొడిగా చేసింది. తలలో పువ్వులే కాదు, చేతికి కొత్తగా కొన్న గాజులు కూడా ఆమెకు వేసుకోవాలనిపించ లేదు.

పుస్తకాలు తీసుకుని కాలేజీకి బయలుదేరబోయింది.

"అదేమిటే - అన్నం తినకుండా వెళ్తున్నావేం?" అనసూయమ్మ ప్రశ్నార్థకంగా అడిగింది

"ఇప్పుడన్నం ఏవిటే? మధ్యాహ్నం వస్తాగా!" సరళ కంఠంలో చికాకు.

"మధ్యాహ్నం నువ్వు వస్తే నేను ఇంట్లో ఉంటానో, ఉండనో అని, ఇప్పుడే తిని వెళ్తావని వంట చేసేశాను. ఇవ్వాళ్టికి టిఫినేం చెయ్యలేదు"

టిఫిను చెయ్య లేదన్న మాట కన్నా, ఇంట్లో ఉంటానో ఉండనో అన్న తల్లి మాటే సరళను ఎక్కువగా ఆకర్షించింది.

"ఎందుకుండవ్? ఎక్కడికి వెళ్తావ్?"

"నేనూ, మీ నాన్నగారూ పెళ్ళిళ్ళ రిజిస్ట్రారాఫీసుకు వెళ్ళాలి!"

ఆ మాట విని నవ్వకుండా ఉండలేక పోయింది కొంటెగా, "నువ్వూ - నాన్న గారూ పెళ్ళిళ్ళ రిజిస్ట్రారాఫీసు కెందుకే? అది పెళ్ళిపోయిన వాళ్ళ కోసం కాదు!" అని అన్నది.

"చెంపలు వాయిస్తాను, నువ్వూ - నీ చిలిపి మాటలూనూ! నేనూ, మీ నాన్నగారూ వెళ్తున్నది మా కోసం కాదు, డాక్టర్ తిలక్ గారి కోసం!" అన్నది అనసూయమ్మ చిరుకోపం నటిస్తూ

సరళ భ్రుకుటి ముకుళించింది. సీరియస్‌గా అడిగింది. ఆయన కోసం ఎందుకూ?"

"ఎందుకేవిటే? ఆయని మళ్ళీ పెళ్ళి చేసుకుంటున్నాడు. రెండో పెళ్ళికి హంగు - ఆర్భాటం ఎందుకని, రిజిష్ట్రీ పెళ్ళి చేసుకుంటున్నాడు, మమ్మల్నిద్దర్నీ సాక్షులుగా రమ్మన్నాడు."

సరళ గభాలున అడిగింది, "డాక్టరు గారు రెండో పెళ్ళి చేసుకుంటున్నారా?.. అన్‌బిలీవబుల్" ఇంకా మూణ్ణెళ్ళైనా కాలేదు కదమ్మా మొదటి భార్య పోయి?"

"మూణ్ణెళ్ళో, మూడేళ్ళో, భార్య పోయిం తర్వాత ఆ మగవాడు ఎంత కాలం ఉంటాడేవిటి. ఇంకో పెళ్ళి చేసుకోకుండా?" అనసూయమ్మ విసుగ్గా అన్నది.

"ఆ చేసుకోబోయే అమ్మాయికి ఇది రెండో పెళ్ళా, మొదటి పెళ్ళా?" మామూలుగా అడిగినట్లుగా అడిగింది సరళ.

ఖస్సు మన్నది అనసూయ. "చిన్నంతరం, పెద్దంతరం ఉండాలి ఏ మాట అనడానికైనా? ఏవిటా మాట్లాడడం? మగమహారాజు, ఎన్ని పెళ్ళిళ్ళైనా చేసుకుంటాడు. డాక్టరు గారిది రెండో పెళ్ళి కదా అని, ఆ చేసుకోబోయే అమ్మాయిది కూడా రెండో పెళ్ళా అని అడుగుతావా? బుద్ధుండక్కర్లా?"

సరళ ఆ వాగ్ధాటిని భరించ లేనట్లుగా అన్నది "సరేనమ్మా! నాకు బుద్ధి లేదు. పొరపాటు మాటన్నాను. చెంప లేసుకుంటున్నాను. సరా? ఇహ కోప్పడకు!" అంటూ రెండు చెంపలూ వేసుకుంది.

పొరపాటు అని ఒప్పుకుని, చెంప లేసుకోవడంతో కూతురు మీద బుస్సున పొంగిన కోపం టప్పున తగ్గిపోయింది అనసూయమ్మకు.

"నీ మీద ఎందుకు కోప్పడతానే- పొరపాటుగా మాట్లాడకు అన్నాను కానీ!" అంటూ ఆర్ద్రంగా అని, "ఇప్పుడెట్లాగే? టిఫిన్ చెయ్యలేదు, అన్నం తిని వెళ్ళమంటే కాదంటావ్?" అన్నది సాలోచనగా.

"కాస్త బాక్స్‌లో పెట్టెయ్యి, లంచ్ అవర్‌లో క్యాంటీన్‌లో తినేస్తాను!"

"మరి ఇప్పుడు? వొట్టి కడుపుతో వెళ్తావా?"

"కాఫీ కలిపి ఇయ్యి, చాలు!"

నిజానికి సరళకు ఆకలిగానే వుంది. కానీ డాక్టరు గారు రెండో పెళ్ళి చేసుకోబోతున్నారన్న మాట ఆకలిని వెనక్కు నెట్టి కోపాన్ని ముందుకు తెప్పించింది.

ఏం మగవాళ్ళు వీళ్ళు!! భార్య బాగా ఉన్నంత కాలం ఆ భార్యతో తిరగడం, ఆమె ద్వారా తమ అవసరాలు తీర్చుకోవడం, ఆమె కన్ను మూయగానే



మళ్ళీ తమ కామం కోసం, తమ దాహం కోసం మరో అమ్మాయిని వెతుక్కోవడం, అదే పని భర్త పోయిన ఓ ఆడది చేస్తే, ఈ సంఘం క్షమిస్తుందా? కాకై కూస్తుంది. పెద్ద పులిలా గాండ్రిస్తుంది. దయ్యంలా మీద పడుతుంది.

క్లాసులో కూచున్నా సరళకు ఇవే ఆలోచనలు. ఇంగ్లీషు మేడమ్ పాఠం చాలా బాగా చెపుతుంది అయినా ఇవ్వాళ ఆవిడ పాఠం కూడా వినబుద్ధి పుట్టడం లేదు.

"ఏవిటే అట్లా ఉన్నావ్?" ఓ స్నేహితురాలడిగింది.

సరళ తన మనసులో మాట చెప్పింది.

"పాపం, ఆ పిల్లల కోసం చేసుకుంటున్నాడేమోనే!!" ఆ అమ్మాయి సందేహంగా అన్నది. ఆ అమ్మాయి మీద ఇంతెత్తున లేచింది సరళ "అమ్మమ్మలా మాట్లాడకు! పిల్లల కోసమే అయితే ఓ ఆయాను తెచ్చుకోమను, ఉంచుకోమను! ఓ ఆడపిల్ల గొంతు కోయడం ఎందుకూ?"

"పిల్ల అని తెలిసినట్టు అంటున్నావ్.– ఎంతేవిటి పెళ్ళికూతురి వయసు?" సరళ స్నేహితురాలు కుతూహలంగా అడిగింది.

"నాకు తెలీదు!".

"తెలీని దానికి, ఇంత కంఠశోష ఎందుకే? పెళ్ళికూతుర్ని చూసిరా, ఆ తర్వాత మాట్లాడుకుందాం!"

ఆ సాయంకాలం డాక్టరు గారి రెండో భార్యను చూడగానే సరళకు బాధ, కోపం మరింత ఎక్కువయ్యాయి. "నేననుకున్నదే కరెక్టు! ఈ డాక్టరు గారు కూడా అందరి మగవాళ్ళ లాంటి వాడే! తన అవసరం కోసం ఓ ఆడపిల్ల గొంతు కోశాడు!" అనుకుంది సరళ.

చుట్టుపక్కల ఇళ్ళల్లో ఉన్న ఆడవాళ్ళందరూ డాక్టరు గారి రెండో భార్యను చూడటానికి వచ్చారు. వాళ్ళతో కలసి సరళ కూడా లోపలికి వెళ్ళింది.


"అమ్మాయ్! నీ పేరు?" ఓ పెద్ద ముత్తైదువ అడిగింది.

"శ్యామల!!"

ప్రశ్నలు... ప్రశ్నల మీద ప్రశ్నలు.. ఒక ప్రశ్నకు మరో ప్రశ్న జత.... మొత్తం మీద ఒక అరగంటలో తమకు కావలసిన సమాచారాన్నంతా శ్యామల దగ్గర్నుంచి వాళ్ళు రాబట్టేశారు.

శ్యామల తండ్రి వో ఎలిమెంటరీ స్కూలు టీచరుగా పని చేసి రిటైరై పోయాడు. తల్లి అయిదారు సంవత్సరాల కిందటే పోయింది. ఆస్తిపాస్తులేం ఉన్నట్టు లేదు. ఉన్న ఒక్క అన్న కోమటి కొట్లో గుమాస్తా. చెల్లెలికి ఏదో విధంగా పెళ్ళి అయిందనిపిస్తే చాలన్నదే అతని ధ్యాస, తపన అతనెట్లాగూ కట్నాలు ఇవ్వలేడు. కానుకలు తలకెత్త లేడు. అంచేత మొదట్లో సంబంధం పెళ్ళి కొడుకులు ఆశ అతను వదిలేసుకున్నాడు. డాక్టరు గారు కబురు పంపితే, అతనికి

## ఒంటిరెక్క గాలిమర



గాలిమరల వాడకం మళ్ళీ పెరుగుతున్నది. పాతకాలపు గాలిమరలకు ఆధునిక రూపంగా మోనోప్టెరోస్ 15 అనే ఒంటి రెక్కతో నడిచేటటువంటి కొత్త గాలిమర తయారయింది. గాలిని శక్తిగా మార్చే ఈ సాధనాన్ని ఈ ఫొటోలో చూడవచ్చు. ఇప్పుడు ఎన్నో రకాల గాలిమరలు వాడకంలో ఉన్నాయి. గాలిమరల్ని వాడుతున్న దేశాలలో అరబ్ దేశాలు ముఖ్యమైనవి. ఈజిప్టులోని సముద్ర తీర పట్టణమైన మర్సామత్రోహకు కావలసిన విద్యుచ్ఛక్తినంతా ఇటువంటి గాలిమర సహాయంతోనే ఉత్పత్తి చేస్తున్నారు. ఈ గాలిని విద్యుత్తుగా మార్చే సాధనాన్ని ష్మిడ్–బోల్కో–బ్లొమ్ అనే సంస్థ తయారు చేసింది. గాలి విసురు పడిపోయినప్పుడు ఒక సమగ్ర డీసిల్ జెనరేటర్ పని చేస్తూ ఉంటుంది. ఈ మోనోప్టెరోస్ 15ను సంవత్సరాంతంలోగా సముద్ర జలంలో లవణాల్ని తొలగించే యంత్రానికి కలుపుతారని, అది రోజుకు 25 ఘనమీటర్ల మంచినీటిని తయారు చేస్తుందని అంచనా వేస్తున్నారు.



ఏనుగెక్కినట్టయింది. చెల్లెల్నిచ్చి కన్యాదానం జరిపించటానికి అతను సంతోషంగా ముందుకు వచ్చాడు.

"అమ్మా! శ్యామలా! పెళ్ళికొడుకు విషయమై నీ అభిప్రాయం ఏమిటమ్మా?" అని అతను ఒక్క ముక్క తన చెల్లెల్ని అడగలేదు. అడగాలని కూడా అతనికి తోచలేదు. శ్యామల తన అన్న పరిస్థితిని మనస్థితినీ గమనిస్తూనే ఉంది.

"రెండో పెళ్ళి సంబంధం? పైగా ఇద్దరు పిల్లల తండ్రినా?" అని ఒక్క ముక్క అనలేదు. తాంబూలాలు పుచ్చుకుంటే, తనకు కాదన్నట్టు అట్లా చూస్తూనే వుంది. 'రిజిస్ట్రార్ ఆఫీసులో పెళ్ళి!' అంటే తలకాయ వూపింది.

"పెళ్ళయిన తర్వాత నువ్వు అటు నుంచి అటే అత్తారింటికి వెళ్తున్నావ్!" అంటే

"ఆహా(!" అన్నదే కాని" మంచిదే అన్నయ్యా! కానీ మరి నా సారె, చీర సంగతేమిటి?" అని ఎదురు ప్రశ్న వేయలేదు.

శ్యామల మాటలబట్టి ఎంతో తెలుసుకున్న ముత్తయిదువులు, కానీ కట్నం లేకుండా డాక్టరుగారు తన రెండో భార్యను పెళ్ళి చేసుకున్నారన్న సంగతి విని, "నిజంగా ఈ కాలంలో పుట్టవలసిన మనిషి కాదమ్మా మన డాక్టరుగారు!" అని ముక్కు మీద వేలేసుకున్నారు.

ఆ తర్వాత డాక్టరు గారి గుణగణాలు కాసేపు పొగిడి, శ్యామలచేత బొట్టు పెట్టించుకుని వెళ్ళిపోయారు.

వాళ్ళు మాట్లాడుతున్నంత సేపూ సరళ, శ్యామలను చూస్తూ మౌనంగా ఓ ప్రక్కన కూచున్నది. వాళ్ళు వెళ్ళిపోగానే డాక్టరుగారి పిల్లలిద్దర్నీ కేకేసి, "రండర్రా! మనింటికి వెళ్దాం!" అన్నది తనూ లేస్తూ

వాళ్ళు ఇక్కడే ఉంటారులెండి!" శ్యామల సన్నగా అన్నది. ఆమె గొంతులో తెలియని ఏదో వేదన ధ్వనించింది.

అప్పుడే దొడ్లో పూసిన కనకాంబరాల్ని వో సజ్జలో పెట్టుకుని శ్యామల తల్లో తురమడం కోసం అక్కడకు వచ్చిన అనసూయమ్మ ఆ మాట విని, "ఇవ్వాళా, రేపూ, ఎల్లుండీ ఆ పిల్లలు మా ఇంట్లోనే ఉంటారులేమ్మా! కొత్తేముందీ?" అన్నది ఆప్యాయంగా, శోభనం రాత్రుల్ని పరోక్షంగా ప్రస్తావిస్తూ-

శ్యామల మొహం ఎర్రబడింది ఇంకేం మాట్లాడలేదు.

డాక్టరుగారి ఇద్దరు పిల్లల్నీ ఇంటికి తీసుకు వచ్చి, అన్నం పెట్టి, కథలు చెప్పి, నిద్ర పుచ్చిం తర్వాత, ఇంకా తిలక్‌గారి బెడ్‌రూంలో లైటు వెలుగుతుండడం చూసి, హాల్లో వున్న తల్లి దగ్గరకు వచ్చి, "అమ్మా!అటు చూడు!" అంటూ లైటు వెలుగుతున్న ఆ గదిని చూపించింది.

అనసూయమ్మ అటు వేపుగా చూసి అర్థవంతంగా తలపంకించింది.

"డాక్టరుగారు ఇలకా ఇంటికి రాలేదేమో!" అన్నది కొంచెం సేపుండి.

"ఎప్పుడో వచ్చారు!" నిష్ఠూరంగా అన్నది సరళ.

పెళ్ళికాని కూతురితో సెక్స్ విషయం

మాట్లాడడానికి మొహమాట పడి ఆ విషయాన్ని అంతటితో తుంచేసింది అనసూయమ్మ. సరళ కూడా మరేం అనలేదు.

మర్నాటి ఉదయం పిల్లలిద్దర్నీ తన రిక్షాలోనే ఎక్కించుకుని కాన్వెంట్‌కు తీసుకు వెళ్తూ, వరండాలో నిలబడి వున్న శ్యామలని చూసి, పిల్లలతో, "అదిగోనర్రా మీ పిన్ని గుడ్‌మార్నింగ్ చెప్పండి!" అన్నది సరళ.

"గుడ్‌మార్నింగ్ పిన్నీ!" అన్నారు పిల్లలిద్దరూ.

శ్యామల ఉలిక్కిపడింది. పిల్లల్నీ, సరళనూ చూసింది పేలవంగా నవ్వింది. వరండా మెట్లు దిగి వీధి గేటు దాకా వచ్చి, సరళతో, "సాయంకాలం వీళ్లను ఇక్కడికే తీసుకు వచ్చేయండి!" అన్నది. ఆ గొంతులో ఇదమిద్ధమని చెప్పడానికి వీల్లేని ఏదో వెలితి అనిపించింది సరళకు.

ఎందుకూ అని అడగటానికి అప్పుడు టైం లేదు. తల వూపి రిక్షాను ముందుకు పొమ్మంది. సాయంకాలం ఇద్దరు పిల్లలూ రిక్షా దిగుతూ "అక్కా, టా, టా!" అంటున్నారు. ముద్దుగా. లోపలకు పరుగెత్తారు.

'టా టా'ల సంబరంలో వాళ్లు రిక్షాలోనే పుస్తకాలు మర్చిపోయారు. అవి తీసుకుని సరళ డాక్టరుగారి ఇంట్లోకి వెళ్ళింది.

శ్యామల వాళ్ళకు డ్రెస్‌ఛేంజ్ చేస్తోంది. సరళను చూడగానే పలకరింపుగా నవ్వి, "రండి!" అన్నది.

"పిల్లలు పుస్తకాలు మర్చిపోయారు!" అన్నది సరళ.

ఇద్దరు పిల్లల్లో పెద్దది అన్నది, "నువ్వు తెస్తావని నాకు తెలుసులే అక్కా!"

"యూ నాటీ!" అంటూ ఆ పిల్ల చెంప మీద సుతారంగా ఒక్కటి వేసి, "వస్తా!" అంటూ శ్యామల వైపు చూస్తూ ఆగింది, "ఏమని సంబోధించాలా?" అనుకుంటూ.

"పిన్నీ!" అని సంబోధించవచ్చు కదా?" అన్నది శ్యామల, ఆ అమ్మాయి మనసులో వున్న సందేహాన్ని పసిగట్టినట్టుగా.

"పిన్నీ అనా?"

"నా పిల్లలకు నువ్వు అక్కవైతే నీకు నేను పిన్నినే కదా?" శ్యామల చొరవకు, తెలివితేటలకు సరళ ఆశ్చర్యపోయింది.

"నీ పిల్లలా?" అన్నది.

"అవును! కనకుండానే తల్లినయ్యాను కదా?... అందులోను- ఇద్దరు పిల్లలకు!! నిండా ఇరవయ్యేళ్ళున్నా లేని శ్యామల అట్లా మాట్లాడుతుంటే అది వ్యంగ్యమో, ఆమె బ్రతుకు భారమో, తన దురదృష్టాన్ని ఆమె ఆ విధంగా ప్రకటించుకోవడమో, సరళకు తెలీలేదు.

ఆ ఇద్దరిదీ దాదాపు ఒకే వయస్సే అయినా, మాట్లాడుకోడానికి వొకే విషయం వాళ్ళకేమీ కనబడలేదు.

ఉన్నట్టుండి సరళ అన్నది. "రాత్రి నీ గదిలో లైట్లు చాలాసేపు వెలుగుతున్నాయే?" క్షణం సేపు శ్యామల మొహం మీద వో నీలి నీడ. ఏదో చెబుదామని పెదవులు కదల్చింది. మళ్ళీ మనసు మార్చుకుని జవాబు చెప్పకుండా వూరికే వుండిపోయింది. సరళ బయల్దేరబోయింది. అది చూసి శ్యామల అన్నది, "ఉండు, కాఫీ తీసుకు వస్తాను!"

వద్దన్నది సరళ "ప్రక్క ప్రక్క ఇళ్ళ వాళ్ళం, మన మధ్య ఫార్మాలిటీస్ వద్దు" "ప్రక్క ఇళ్ళ వాళ్ళమే కాదు, డాక్టరుగారికి మీ అమ్మగారంటే ఎంతో గౌరవమని కూడా తెలిసింది. బహుశః ఆయన్ని రెండో పెళ్ళికి మీ అమ్మగారే ప్రోత్సహించి ఉంటారు!"

కొరడా పెట్టి కొట్టినట్టు ఛెళ్ళున తగిలిందా మాట సరళకు. అబ్బే! లేదు. లేదు. అట్లా మా అమ్మ చెప్పదు!" అన్నది కంగారుగా.

"ఏం అట్లా చెబితే మాత్రం తప్పేముంది? ఒక ఆడకూతురుకు కన్నె చెర విడిపించిన పుణ్యం వస్తుంది కదా? మన దేశంలో ఒక ఆడ పుట్టువు పెళ్ళి కాకుండా ఇంట్లో పడి వుంటే అదెంత బరువు ఆ కన్నవాళ్ళకు? డాక్టరుగారిలాంటి వాళ్లు ముందుకు రాకపోతే నాబోటి వాళ్లు ఏమైపోవాలి?

శ్యామల అంటున్న మాటలు సరళ గుండెల మీద సూటిగా వచ్చి తగులుతున్నయ్! చివరగా శ్యామల వో మాట అన్నది, "దాదాపు నువ్వూ, నేనూ ఒక వయసు వాళ్లం. అవునా? ఇంటి ప్రక్క ఇంత మంచి సంబంధం పెట్టుకుని, మీ అమ్మగారు నిన్ను డాక్టరుగారికి ఎందుకివ్వాననలేదో?

సరళ తల వొంచుకుని గుమ్మం దాటుతోంది, వెనగ్గా వచ్చింది మళ్ళీ శ్యామల కంఠం. "బహుశః డాక్టరుగారికీ నీకూ మధ్య వున్న వయసు తేడా ఆవిణ్ని భయపెట్టి వుంటుంది; ఎంత చెడ్డా నేను మరో అమ్మ కన్న బిడ్డను కదా?" తన తల్లి మీద ఆ కొత్త కోడలు వేసిన అభాండం, తనతో అన్యాపదేశంగా వెళ్ళబోసుకున్న వ్యథ, సరళ ఉన్నది వున్నట్టు అనసూయమ్మతో చెప్పింది.

"ఆ అమ్మాయి చేసిన ఆరోపణ నిజమేనా?" అన్నది సీరియస్‌గా.

"ఏవిటే ఆ ఆరోపణ? ఆ పిల్ల అనడమూ, నువ్వు నన్ను అడగడమూనూ! ఒకవేళ డాక్టరుగారితో అట్లా అన్నానే అనుకో, అది తప్పా? కూచుని తినలేక అనే మాటలు తప్ప!! మగవాడికి వయస్సేమిటి, మనస్సు ముఖ్యం కాని!! డెబ్బయి ఏళ్ల వయసులో మీ ముత్తాతయ్య మీనాన్నను కన్నాట్ట! తెలుసా" అన్నది అనసూయమ్మ మొహాన్ని గంటు పెట్టుకుని. సరళ ఇహ తల్లి దగ్గర నుంచో లేదు. నిట్టూరుస్తూ తన గదిలోకి వెళ్ళిపోయింది. శ్యామల అట్లా అన్న తర్వాత, ఆ అమ్మాయి దగ్గరకు మళ్ళీ వెళ్ళలేదు సరళ. గిల్టీగా ఫీలు కాసాగింది. మనసు గట్టి చేసుకుని ఒకసారి వెళ్ళి వద్దామన్నా, శ్యామల ఎప్పుడూ ఏదో పని చేస్తూ కనబడసాగింది.

ఒక్క క్షణం తీరిగ్గా రెండు కాళ్లూ ఒక్క చోట ముడుచుకుని కనబడలేదు. "ఇది విన్నావుటే? ఇంట్లో పని మనిషిని మాన్పించేసి ఇంటి పనంతా శ్యామలే చేస్తోందట!! డాక్టరుగారు సంపాయిస్తున్నది చాలక, పైసా పైసా తను కూడా

రాజాలక్ష్మి అవార్డు వ్యవస్థాపకుడు శ్రీ రమణయ్య రాజా షష్టిపూర్తి ఉత్సవం ఇటీవల మదరాసులో వైభవోపేతంగా జరిగిన సందర్భంగా తీసిన ఛాయా చిత్రం.



కూడబెడదామని కాబోలు! డబ్బే! డబ్బు!! లేని కొంపలో నుంచి వచ్చేసరికి, డబ్బు మీద యావ ఎక్కువైపోయి వుంటుంది!" అన్నది అనసూయమ్మ అన్నాల దగ్గర సరళతో వో రాత్రి.

"ఆ అమ్మాయి అట్లా కనబడలేదే నాకు!" సరళ మెల్లగా అన్నది.

"నీకేం తెలుసే? పెళ్ళి కాని పిల్లవు?... పెళ్ళయిన ఆడవాళ్ళు ఎట్లా ప్రవర్తిస్తారో?" ఇంకో నెల పోయింతర్వాత, మధ్యాహ్నం పూట సరళ కాలేజీ నుంచి వచ్చిం తర్వాత, ఆ అమ్మాయికి అన్నం పెడుతూ అనసూయమ్మ అన్నది, "సరూ, ఈ సంగతి తెలిసిందా నీకూ?"

"ఏ సంగతి?" సరళ కుతూహలంగా అడిగింది.

"డాక్టరుగారింట్లో తోట మనిషినీ, వంట మనిషినీ కూడా మానిపించేసిందట ఆ కోడలు పిల్ల!" వంటా-పెంటా అంతా తనొక్కతే స్వయంగా చూసుకుంటోందట!! పిల్లల్ని అటూ యిటూ కదలనివ్వటం లేదట! వాళ్ళకు పాఠాలూ అవీ తనే చెప్తోందట!! ఇప్పుడేమంటావ్? ఇదంతా ఆదా కోసం, అవునా కాదా? కాలు మీద కాలు వేసుకుని మహారాణీలా అన్ని భోగాలూ అనుభవించక ఈ కాయకష్టం ఏవిటట ఆ అమ్మాయికి?" అనసూయమ్మ నిష్ఠూరంగా అడిగింది.

## తపస్సు

ఫలితం మాటిలా వున్నా
జ్వలించే ఈ తపన
లయించే క్షణాలని
లక్షల అక్షరాల్లో
నిక్షిప్తం చెయ్యాలని
ప్రాణ శక్తితో మెరిసే జీవితాలనించీ
జ్ఞాన దీప్తి గ్రహించాలని,
కవ్వించే కళను
కౌగిలించాలని

—సౌభాగ్య

## ఆడపుట్టువు

"ఒకసారి నువ్వే స్వయంగా వెళ్ళి చెప్పి రాకపోయినావా?" సరళ సౌమ్యంగా అన్నది.

"అదే అనుకుంటున్నాన్లే!"

అనుకుంటున్నట్లుగానే. రాత్రి తొమ్మిది గంటలవేళ డాక్టరు గారి దొడ్లో నూతి చప్టా దగ్గర శ్యామల చన్నీళ్ళు స్నానం చెయ్యడం చూసి, ఉండబట్టలేక అనసూయమ్మ అక్కడికి వెళ్ళి అడిగింది."రాత్రిపూట ఈ చన్నీళ్ళ స్నానాలేమిటమ్మాయ్?"

"రండి, రండి అక్కయ్యగారూ!" అంటూ ఇరవైయ్యేళ్ళ శ్యామల యాభయ్ ఏళ్ళ అనసూయమ్మను తీసుకుని, దండెం మీద ఉన్న మడి బట్టను వంట జుట్టుకుని దేవుడి గదిలోకి దారి తీసింది. దేముడి గదిలో జాజ్వల్యమానంగా దీపాలు వెలుగుతున్నయ్. అగరబత్తీల పరిమళం గది అంతటా వ్యాపించి ఉంది. దేముడి ముందు మోకరించి శ్యామల అన్నది. "భగవంతుడా! నాకు ఏ వరం ఇచ్చినా ఇవ్వకపోయినా, డాక్టరుగారినీ, పిల్లల్నీ చల్లగా కాపాడు!" పిల్లల కోసమే నిన్ను పెళ్ళి చేసుకుంటున్నాను సుమా!" అన్నారు నా పతి దేవులు" కన్నె పిల్లలందరూ కలలు కనే మొదటి రాత్రి 'క్షమించు శ్యామలా! నేను పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయించుకున్నాను!" అన్నారు నా భర్త. నాకెట్లాగూ తల్లినయ్యే యోగం లేదు. కనీసం ఈ ఇంటి దాసిగానైనా నా ఆడ పుట్టువును సార్థకం చెయ్!" అంటూ శ్యామల వెనక్కు తిరిగి చూసింది. అనసూయమ్మ అక్కడ కనబడలేదు.




నూతన యవ్వనం పొందండి! సంతానవంతులు కండి. చర్మ వ్యాధులనుండి విముక్తులు కండి. హస్త ప్రయోగమువలన కలుగు నరముల బలహీనత, శీఘ్ర స్ఖలనము, అంగము చిన్నదగుట, అవసర కాలమందు అసంతృప్తి, సంతానము లేక పోవుట, సమస్త చర్మవ్యాధులకు ఆయుర్వేద చికిత్స ! పోస్టు ద్వారా చికిత్స కలదు.

"క్యాంపులు" : ప్రతి ఆదివారం 'భీమవరం' షణ్ముఖ లాడ్జిలో ఉదయం 8 గం. నుండి సాయంత్రం 6-30 గం. వరకు, ప్రతి నెల 1 మరియు 16 తేదిలలో 'రాజమండ్రి' హోటల్ అశోకాలో కోటగుమ్మం దగ్గర మధ్యాహ్నం 12 గం. నుండి రాత్రి 9 గం. వరకు.

**డా॥ డి. మార్కండేయులు**

ఆయుర్వేద భిషక్, సెక్స్ & స్కిన్ స్పెషలిస్ట్,

పార్కురోడ్, గుడివాడ-521301

ఫోన్స్ : 522 & 540



చదవండి! చదివించండి!!

విజ్ఞాన వికాసాలకు, ఉత్తమ సాహిత్య పరిచయాలకు

**తెలుగు విద్యార్థి**

విద్యా సాంస్కృతిక మాసపత్రిక

విద్యారంగ ప్రగతికి, అధ్యాపకుల సంక్షేమానికి, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్న ఏకైక తెలుగు మాసపత్రిక

★ పాఠకుల ప్రశ్నలకు లోకాయుక్త అవుల సాంబశివరావు గారి సమాధానాలు.

★ విద్యా విషయక వ్యాసాలు, ప్రముఖుల పరిచయాలు, కథానికలు, కవితలు, నాటికలు, కొత్త పుస్తకాల వివరాలు, ప్రభుత్వ ఉత్తరువుల విశేషాలతో ప్రతి నెల 25 వ తేదీన పై నెల సంచిక వెలువడుతుంది.

★ ప్రాతినిధ్యంలేనిచోట్ల ఏజంట్లు కావాలి. విడి ప్రతి 2 రూపాయలు. ప్రత్యేక సంచికతో సహా సంవత్సర చందా 25రూపాయలు

★ విజ్ఞాన వికాసాలకు ★ఉత్తమ సాహిత్య పరిచయాలకు

★ విద్యా సాంస్కృతిక మాస పత్రిక

వివరాలకు:- తెలుగు విద్యార్థి

పోస్ట్ బాక్స్ నెం:1, మచిలీపట్నం-521001